




# ఆభిజాత్యం

పి.పాపిరెడ్డి



ధృవాలు భిన్నాలైనా వాటి దగ్గరి భౌగోళిక పరిస్థితులు, శీతోష్ణ స్థితిగతులు మాత్రం ఒకటిగానే ఉంటాయి. అట్లాగే ఆర్థిక అంతస్థుల్లో ఎంత వ్యత్యాసమున్నా రక్తసంబంధాల కూకటి వేరు మాత్రం ఒకటిగానే ఉంటుంది. అది పరిస్థితుల ప్రాబల్యంతో పచ్చబడి సామాజిక అసమానతలు అనే పొరలను చీల్చుకొని, ఆభిజాత్యం తాలూకు అంకురం మొలకెత్తుతూ ఉంటుంది.

'ఒరేయ్ రంగడూ! ఈ తొట్టి నిండా నీళ్ళు తోడరా' అంది సావిత్రమ్మ.

'రంగారావు అనం డమగారూ!' వాడి మాటలలో నిరసన, అభ్యర్థన మిళితమై ఉన్నాయి.

'రంగారావు అనకుంటే నీవు చేసే కలెక్టర్ గిరికి నామోషి రాదులే!' విసుక్కుంటూ లోపలి కెళ్ళింది సావిత్రమ్మ.

వాడు పనిలో మునిగి పోయాడు. నోట్లో బ్రష్ వేసుకొని అరుగు మీద చేరిన కొత్త అల్లుడు గోపాలం తాను వచ్చిన మూడు రోజుల నుండి ఇదే వరుస వింటున్నాడు. ఇది ఇట్లా ఎంత కాలం నుండి జరుగుతుందో అతనికి తెలియదు. ఆ సంభాషణ విన్నప్పుడల్లా అనేక ఆలోచనలు కలగాపులగంగా అతని మనసులో మెదిలేవి.

చేసే పనికి, పిలిచే పేరుకు పొంతన ఉండటం అవసరమా? పనిని బట్టి పేరుకు విలువ వస్తుంది.

ఐస్ పార్లర్‌లో పని చేసిన ఐసేన్ హోవర్, గని కార్మికుడు కృశ్చేవ్ ప్రపంచంలోని రెండు పెద్ద రాజ్యాలకు అధిపతు లవుతారని ఎవరనుకున్నారు? నిరంతరం శ్రమించే ఈ రంగారావు అనే అబ్బాయి ఏ తల్లి దండ్రుల నోముల ఫలమో? ఎన్ని తరాల వరమో, ఎంత చరిత్రకు వారసుడో, మరెంత చరిత్రకు మూలపురుషుడో ఎవరు చెప్పగలరు!

ఈ విషయాలన్నీ సావిత్రమ్మగారితో చర్చిస్తే-అనుకున్నాడు గోపాలం.

ఒకరికి చెప్పడమే కాని, చెప్పించుకోవడమెరుగదు సావిత్రమ్మ. పతి ప్రాణాలకోసం యముణ్ణి ఎదిరించే అవకాశం ఆమె కింతవరకు రాలేదు కాని-ఆ వాడలోని ఎందరో ఆడవాళ్ళకు అప్పులిచ్చే యముల్లాంటి కాబూలీవాలాల నుండి వారి పతుల ప్రాణాలు కాపాడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆమె మాటంటే ఆ వీధి వారికి వేదవాక్కు. అప్పులోళ్ళను చూసే తీరు, అల్లుణ్ణి చూసే తీరు ఆమెకు బాగా తెలుసు. భర్తనుంచే గీత, పిల్లలు రాయాల్సిన రాత, అవసరాల కేసేమేత, నౌకర్లకు వేసే వాత ఆమెకు పుట్టుకతోనే వచ్చిన చేత। ప్రతి ప్రాణిని అంచనా వేసి కొన్ని హద్దులు, సరిహద్దులు గీసేది. తానెంత కొత్తల్లుడైనా, ఆ గీతలు చెరపడం తను ఆఫీసరైనంత సులభం కాదు.

అందుకే అటుగా వచ్చిన ఆ అబ్బాయిని 'రంగారావూ' అని ఆప్యాయంగా పిలిచాడు గోపాలం, వాడినైనా ఒప్పిద్దామని.

వాడి ముఖం దీపావళి మతాబులా ఒక్కక్షణం వెలిగింది. 'పిలిచారా, బాబూ' అంటూ వినయంగా నిల్చున్నాడు.

'అవునురా, అబ్బాయ్! రంగడు అనగనే వచ్చిన లోపం ఏమిటిరా నీకు?' అడిగాడు గోపాలం.

వాడు ఇబ్బందిగా కదిలాడు. తలపైకెత్తి, 'అదికాదు, బాబుగారూ! ఒకరంటే అంద రంటారు. పాలు తెచ్చే సోమన్న, అంట్లు తోమే పుల్లమ్మ, కావడి వేసే మల్లన్నా

అందరూ 'ఒరేయి రంగడూ' అంటారు. మా తాతగారు చినబాబుగా ఉన్నప్పుడే ఊరందరినీ 'ఒరే' అనే వాడట. ఇప్పుడు నేను ఊరందరి చేత 'ఒరే' అనిపించుకుంటున్నాను' అన్నాడు బాధగా.

'ఎప్పుడూ మీ తాత గొప్పలు చెప్పడమేనా, ఏమైనా పనిలో వేలు పెట్టావా?' అంటూ వచ్చాడు గోపాలం మామగారు గురుమూర్తి.

కనుకొలుకుల్లో అభిమానం, రోషం తాలూకు ఎఱ్ఱని కాంతి కనిపించింది. 'నీళ్ళు తోడాను, అయ్యగారూ, బాబుగారు పిల్చిస్తే...' కళ్ళు దించుకొని వెంట్రుకలు ఎగ దోసుకుంటూ వడివడిగా వెళ్ళిపోయాడు.

తెల్లగా, సన్నగా రివటలా ఉంటాడు. పది పన్నెండేళ్ళుండవచ్చు. వయసుకు తగిన శక్తి లేదు. చెప్పిన పని చక్కగా చేయాలనే ఆసక్తి మాత్రం ఉంది. బాధల బ్రతుకు వాడికి బాధ్యత నేర్పింది.

'ఎవరండీ ఈ అబ్బాయి?' గురుమూర్తి నడిగాడు గోపాలం।

'వీడా? ఒకసారి నేను పట్నం వెళ్ళినప్పుడు మా స్నేహితు డొకడ్ని మా ఇంట్లో పని చేసేందుకు ఒక కుర్రాడు కావా లన్నాను. అతను పట్నంలో హోటల్ నడిపేవాడు. "మా హోటల్లో ఒక పిల్లవాడు ఉన్నాడు. చాకులాంటి కుర్రాడు. వయసు ఎక్కువగా లేదు. పని చక్కగా చేస్తాడు. కాని, వాడి కులాన్ని, గుణాన్ని కించపరిస్తే మాత్రం ఓర్చుకోలేడు" అంటూ వీడ్ని చూపాడు. వీడు అప్పుడే వాడి తాత ముత్తాతల నుండి మూడు తరాల పురాణ పురుషుల చరిత్ర నంతా ఎంతో ఉత్సాహంతో ఏకరువు పెట్టాడు. బతకడానికి ఏదో ఒకటి చేయక తప్పదు గదా అంటూ తలూపాడు. మేము నవ్వుకున్నాం. వాడిని తీసుకొచ్చి ఇంటి పనంతా వాడి మీద వదలి పెట్టాం. నమ్మకంగా చేస్తాడు. వచ్చిన చిక్కల్లా ఒరేయి రంగడూ అంటే మాత్రం ఒప్పుకోడు. ఆ ఒక్క మాట అనకుండా మీ అత్తగారు బతకలేరు. అదొక్కటే ఇబ్బంది' అన్నాడు గురుమూర్తి బిగ్గరగా నవ్వుతూ. గోపాలం కూడా నవ్వాడు.

అల్లుడికి వాడి హరికథ వినిపించాలని సరదా పుట్టిందేమో, 'రంగారావు' అని పిల్చాడు గురుమూర్తి.

'వస్తున్నా, బాబూ!' తడి చేతులు నిక్కరుకు తుడుచుకుంటూ, వెంట్రుకలు పైకి ఎగ ద్రోసుకుంటూ వచ్చి నిల్చున్నాడు.

పసితనం వదలని లేతబుగ్గలు లేయెండలో పచ్చగా మెరుస్తున్నాయి. చేతులు కట్టుకోలేదు. కళ్ళు భయంగా పెట్టుకోలేదు. మొహం మీద చిరునవ్వు చెదరలేదు. యజమాని పిలుస్తున్నట్లుగా కాక ఎవరో పిల్లవాడు ఆడుకోవడనికి పిలుస్తున్నట్లుగా వచ్చాడు.

'ఏమిరా- మీతాత ఏం చేసేవాడు?!' గురుమూర్తి తీగ కదిపాడు.

వాడి కళ్ళు ఒక్కసారి నియాన్ బల్బుల్లా వెలిగాయి. ముఖమంతా సంతోషం విద్యుత్తులా ప్రాకింది.

'అది తల్చుకుంటేనే కడుపు నిండిపోద్ది, అయ్యగారూ! మా తాతగారు చుట్టూ పది పల్లెలకు జమీందారు.పొడగాటి మనిషి. ఎత్తుకు తగ్గ లావు. చూసేవాళ్ళకు నిజంగా రాజులా కనపడే వారట. తలపాగా చుట్టి, సుంగులు విడిచి పేటంచు పంచెకట్టి, పొన్నుకఱ్ఱ చేతబట్టి వాకింట్లో నిలబడితే....'

'ఇంట్లో మంచాలు, కుర్చీలు ఏవీ లేవట్రా కూర్చోటానికి?' నవ్వకుండా అన్నాడు గురుమూర్తి.

అందరు గొల్లున నవ్వారు. వాళ్ళతో పాటు వాడూ నవ్వాడు.

'అవన్ని నాకు తెలియదు, బాబుగారూ! ఆయన వరండాలో అటూ ఇటూ పచార్లు చేస్తుంటే వీధిలో వెళ్ళేవాళ్ళు వీధి మొదట తల వొంచితే, వీధి చివర తలెత్తే వారట. ఆయన కన్పించినంత సేపు వంగి వంగి సలాములు చేస్తూ పోయే వారట.'

'అబ్బ అంత గొప్పవాడా మీతాత!' అన్నది గోపాలం చిన్న మరదలు పాప, వరండాలో ఠీవిగా తిరుగుతూ పిల్ల లందరి చేత వందనాలందుకునే తమ హెడ్‌మాస్టరు గుర్తుకు వచ్చి.

రెట్టించిన ఉత్సాహంతో 'అవును, పాపా! మా తాతపేరు చెప్తే చుట్టు ప్రక్కల పది ఊళ్ళలో పసిపిల్లలు పాలు త్రాగేవారుకారట!'

'అంత దుర్మార్గుడారా మీ తాత?' అన్నాడు గురుమూర్తి.

'అది కాదు, బాబుగారూ! మాకు ఆవులమంద ఉండేదట. తీసిన పాలన్నీ పల్లెల్లో పసిబిడ్డ వున్న ప్రతి ఇంటికి రోజూ పంపే వారట. పాలు పడ్తూ-

"పార్వతీశం బాబు పాలుపంపాడు
పసిడి బుగ్గల బాబు పాలు త్రాగయ్యా
పార్వతీశం బాబు పాలు పంపాడు
బొజ్జనిండా తాగి బజ్జొకన్నయ్య

'మీ తాత పేరు పార్వతీశంగారా?' గోపాలం అడిగాడు.

'అవును, బాబూ!
పార్వతీశంబాబు పాలు పంపాడు
పట్టు పురుగుల మీద పవ్వళించయ్య..'

'పట్టు పరుపుల వాండ్లకు పాలు లేవంట్రా?!' అన్నాడు గురుమూర్తి నవ్వుతూ.

'పాట అట్లా పాడేవారు, బాబూ! పాట వింటూ పాలు త్రాగను కూడా మరచిపోయి పసిపిల్లలు బోసి నోటితో నవ్వుతూ చూస్తుండే వాళ్ళట.'

'ఇవ్వన్ని నీ కెవరు చెప్పార్రా?' అంది గోపాలం శ్రీమతి రాణి.

'మా అమ్మ చెప్పే దమ్మా. నాకు అన్నం తినిపిస్తూ ఈ కథంతా రోజూ చెప్పేది. పాట పాడుతూ తినిపించేది.'


'పాలు తాపుతూ కదా పాడేది?' అంది పాప పాయింటు తీస్తూ.

వాడి ముఖం కాలి ఆరిపోయిన కొవ్వొత్తిలా అయింది. 'అప్పుడు మాకు పాలు లేవుగా! చాలినంత తిండి కూడా ఉండేది కాదు.'

'ఒరేయి రంగడూ! రోజూ చెప్పే ఈ బాగోతానికేమి గాని పశువులు పోతున్నాయి తోలరా.' సావిత్రమ్మ కేక పెట్టింది.

పశువులు తోలడానికి వాడు పరుగెత్తాడు. గోపాలం ఆలోచనలో పడ్డాడు. వాడి అంతరంగ మథనానికి, వాస్తవ పరిస్థితికి ఎక్కడా పొంతన కుదరక వాడుపడే బాధ కళ్ళలో స్పష్టంగా ప్రతిఫలించేది. విషాదంతో వాడి మొహం ఒక్కొక్కసారి వాడి రాలిపోయే పువ్వులా ఉండేది. అంతలోనే కొత్తనీరు తగిలి లేచివుళ్ళతో మొగ్గలు తొడిగే పూలరెమ్మలా సంతోషంతో మెరిసిపోయేది.

సాయంత్రం మామగారి తోట



దగ్గరకు వెళ్తున్న గోపాలంతో పాటు వాడూ వెళ్ళాడు. వెళ్ళినంత సేపూ వాడు వనపిట్టలా వాగుతునే ఉన్నాడు. గోపాలం వినుక్కోకుండా వింటూనే ఉన్నాడు.

నందనవనం లాంటి తోట చుట్టూ కోట చుట్టుగోడలా కంచె పటిష్ఠంగా ఉంది. తోటలోని చెట్లు గుమ్మటాల్లా ఉండి, జడలు విరబోసుకొని బారులు తీరి కూర్చొని తదేక ధ్యానంలో ఉన్న తాపసుల్లా ఉన్నాయి. తపోభంగం కాకుండా నిశ్శబ్దంగా నిలబడి చూస్తున్నట్లుగా ఉంది ప్రకృతి. అక్కడి ప్రశాంతతకు పరవశించిన అతని హృదయం శాంతి సరస్సులో తేలియాడే శ్వేతహంసలా ఉంది.

మామగారు కొద్ది దూరంలో పని చేయిస్తున్నారు. అలసిపోయిన రంగడిని వదలిపెట్టి నట్లుంది. చెమటతో చారలు గట్టిన ముఖాన్ని చొక్కాతో తుడుచుకొంటూ గోపాలం' ఎదురుగా చతికిలపడి తనగొడవ మరల మొదలుపెట్టాడు. గలగలా మాట్లాడే రంగడిని ఆపి 'పాలు పంచే తాతగారున్నారంటివి. మరి నీ కిప్పుడు తల దాచుకోవడానికి కూడా తావులేదే. అదంతా ఏమయింది?' అన్నాడు గోపాలం.

'ఏముంది, బాబూ, మాతాతగారు మరణించారు. మా పెదనాన్న గ్రామమునసబు. మానాన్న గ్రామ సర్పంచ్‌। మా పెదనాన్న పన్నులు తింటూ, రశీదులు ఇచ్చేవాడు కాడు. ప్రజలను బాధపెట్టి లంచాలు తినేవాడు. ఇది తప్పు అన్నాడట. ప్రజలు వోట్లువేస్తే గదా గెలిచింది- అనకపోతే ఎట్లా మీరు చెప్పండి?' అనడం ఎంత సబబో గుర్తించమన్నట్లు చూశాడు అతని వైపు.

'అవును. అనాల్సిందే' అన్నాడు గోపాలం దృఢంగా.

'మరి అట్లా అన్నందుకు మా పెదనాన్నకు కోపం వచ్చింది.మాటకు మాట పెరిగింది. "నీ అంతు చూస్తా" నన్నాడు. " నా కంటే ముందే ప్రజలు నీ అంతు చూస్తారు' అన్నారట మానాన్న. దానితో మా పెదనాన్న రెచ్చిపోయి కొంత మందిని పోగేసుకోని, మానాయన పై కేసుపెట్టి, దొంగ బాండ్లు పుటించి ఆస్తిని వేలం వేయించాడట.'

ఇన్ని విషయాలు వీడికెట్లా తెలుసు అన్నట్లుగా ఆశ్చర్యంగా చూస్తున్న గోపాలం వైపు చూసి-'విచిత్రంగా ఉంది కదూ, బాబుగారూ! ఇంతకంటే విచిత్రం యేమిటంటే మా పెదనాన్న కుమారుడు మా తాతలాగే మంచి బుద్ధిమంతుడట, బాబూ! ఆయన్ను మా అమ్మ సొంత తల్లిలాగే సాకిందట. పిన్నమ్మదగ్గరకు పోవద్దని మా పెదనాన్న చింత మెల్లెలతో వళ్ళంతా వాయకొట్టినా, ఏ రాత్రిపూటో పరుగెత్తుకొనివచ్చి, "పిన్నమ్మా! నేను వచ్చాను" అనేవాడట. మాఅమ్మ కన్నీళ్ళు పెట్టుకొని ఆ దెబ్బలకు మందురాసి, "నీ విక్కడకు రావద్దులే, బాబూ, నీ వీ దెబ్బలు తినలేవు" అని యేడ్చేదట. "నన్ను చదువుకొని పెద్దవాడ్ని కానీలే, పిన్నమ్మ ఆతర్వాత చెప్తాను" అనేవాడట, మా అమ్మ ఒడిలో దూరి.


మానాన్న వేరే ఊరు వచ్చేశాడు. ఏమి చెయ్యాలి? ఏమి తినాలి? ఎంత కష్ట పడ్డా కడుపు నిండేదికాదు. కరువులో మానాన్న చని పోయాడు. క్షయరోగంతో మా అమ్మ చనిపోయింది. మా పక్కింటాయన దయతలచి నన్ను తీసుకొచ్చి హొటల్లో తిండికి చేర్చాడు.'

'మీ అమ్మ నీకు యేమీ ఇచ్చిపోలేదా?' అన్నాడు గోపాలం.

'ఏముంది, బాబూ, ఇవ్వడానికి? ఒకటి మాత్రంఇచ్చింది. మా అన్నయ్య అక్కడెక్కడో చదువుకుంటూ రాసిన ఉత్తరం. ఆ ఉత్తరం నా చేతికి ఇస్తూ "మీ అన్నయ్య చాలా మంచివాడు, బాబూ! వాడే నీకు తల్లీ తండ్రి. కొంచెం పెద్దయ్యాక ఎట్లాగైనా మీ అన్న దగ్గరకు చేరు. అన్నీ వాడే చూసుకుంటాడు" అంది. మా అన్నయ్య కనపడితే నాకేమి దిగులుండదు, బాబూ.'

వాడి చంచలనేత్రాలలో ఎంత అచంచలమైన విశ్వాసం. ఒకే రక్తం పంచుకు పుట్టిన అన్నదమ్ములే స్వార్థంతో కత్తులు నూరుకునే ఈ కాలంలో ఆగర్భ శత్రువులాంటి ఆపెదనాన్న కుమారుడిమీద వాడింత ఆశ పెట్టుకోడం భావ్యం కాదనిపించింది.

'మీరే కాదు, బాబుగారూ, నా


తెల్ల మచ్చలకు చికిత్స




దాంపత్య జీవితాన్ని ఆనందించండి



తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

SHYAM AYURVED BHAVAN (A )
P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105







మాటలు విన్న ప్రతివారు నవ్వుతారు. ఎగతాళి చేస్తారు. చాలామంది నమ్మరు కూడా ' అంటూ నిక్కరూడదీసి మొలత్రాటికి కట్టిన చిన్న నంచి తీశాడు. అందులో నలిగిపోయిన ఒక పాత ఉత్తరాన్ని బయటకు తీసి, 'బాబుగారూ! ఇది చూడండి- నా మాట అబద్ధమేమొ. మీ రొక్కరు నమ్మినా చాలు నాకు ' అంటూ చేతి కిచ్చాడు.

గోపాలం మడతలు విప్పాడు. అది ఏ మడత కా మడత ఊడివచ్చింది. అవన్నీ వరుసగా పరిచి మాసిపోయిన ఆ అక్షరాలను కూర్చుకుంటున్నాడు. కొంత గుర్తు పట్టగానే ఆ తర్వాత చూడాల్సిన అవసరం లేకపోయింది.

చెమట పట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ కంఠస్వరాన్ని కూడదీసుకొని, 'మీ అమ్మగారి పేరు వెంకటలక్ష్మమ్మా?' అడిగాడు గోపాలం.

'అవును, బాబూ! అందులో ఉందిగా- "తమ్ముని నా యంతటి వాణ్ణి చేస్తాను, పిన్నమ్మా! భగవంతుని మీద ప్రమాణం చేసి చెబుతున్నాను, నా మాట నమ్ము" అని- మా అన్న అమ్మకు రాసిన ఉత్తరం, బాబూ!'

ఈ చినిగిన కాగితం మీద వెలసిన అక్షరాలను నమ్ముకొని ఆ అజ్ఞాతవు అన్నమీద ఎంత మమకారాన్ని పెంచుకొన్నాడు. గోపాలం కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

'ఇప్పటికైనా నమ్ముతారా, బాబూ, నేను చెప్పింది నిజమని.'

'ఏమోయ్! రంగారావుగారి కథింకా నశేషమేనా?' అంటూ అక్కడికి వచ్చాడు గురుమూర్తి.

రంగారావు నవ్వాడు. గోపాలం నవ్వలేదు.

'లేలే, పొద్దు పోతోంది. ఇంటికి వెళ్దాం' అన్నారు మామగారు.

గురుమూర్తి తోట విషయాలు, కుటుంబ సమస్యలు, దేశరాజకీయలు అన్నీ కలగలపి సాంబారులా వడ్డిస్తున్నారు. గోపాలం 'ఊ' అంటున్నాడు గాని, మనసు మరెక్కడో ఉంది. ఇంటికి చేరేసరికి ఇంతాలస్యమైం దేమంటూ సావిత్రమ్మగారు హడావిడి పడుతున్నారు.

గోపాలం స్నానం చేస్తున్నాడే కాని, మెదడంతా వేడినీళ్ళల్లో మరగబెడు తున్నట్లుంది.

మనసు ఎంత అల్పమైంది! ఉన్నవానితో లేని సంబంధాన్ని కలుపుకోవడానికి ఉత్సాహపడుతుంది గాని, లేని వానితో ఉన్న 'బాంధవ్యాన్ని చెప్పుకోడానికి సిగ్గుపడుతుంది. ఆస్తి అంతస్థు, అధికారాల అంతరం రక్త సంబంధాన్ని కూడా కాల తన్నుతోంది. తన స్థాయికి తగ్గితే జన్మనిచ్చిన తండ్రినైనా 'జనకుడు' అని చెప్పుకోవడానికి నోరురాని సమాజంలో మనిషి జీవిస్తున్నాడు. గోపాలం మంచివాడే. కాని, మనిషి కాదా!

వెనుక గదిలో బట్టలు మార్చుకుంటున్న గోపాలానికి హాలులోని మామగారి మాటలు స్పష్టంగా వినపడుతున్నాయి.

గురుమూర్తి గోపాలం విడిచిన బూట్లు చూపించి, 'ఒరే రంగడూ! ఆ బూట్లు తుడిచి అక్కడ పెట్టరా ' అన్నాడు.

వాడు వంగలేదు. బూట్లు అందుకోలేదు. గురుమూర్తి వైపు దీనంగా చూసి తల దించుకున్నాడు.

గురుమూర్తి ఒళ్ళంతా ఒక్కసారి కోపంతో భగ్గుమంది. కళ్ళు కాలిన కొఱవుల్లా ఉన్నాయి. రంగారావు చెంపచెళ్ళుమంది. ఒళ్ళు తెలియని కోపంతో అరుస్తున్నాడు గురుమూర్తి- 'ఎంగిలి విస్తర్లు యెత్తే వెధవకు ఎంతపొగరు? నీ కళ్ళలో కొవ్వుందిరా. నీ వొక జమిందారువనుకుంటున్నావేమో. ఎంగిలి మెతుకులకు కూడా గతిలేని వెధవ్వి. నీ తాత ముత్తాతలు అంతకంటే గతిలేని కుక్కలు..'

'మామగారూ!' గోపాలం అరుపుకు అందరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. సావిత్రమ్మ, పిల్లలు పరుగెత్తుకొచ్చారు.

కోపంతో కందిపోయిన ముఖాన్ని, జీరపోయిన కంఠాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుంటూ గోపాలం- 'వీడి తాత తండ్రులు కుక్కలు కాదు, మామగారూ! కుక్కల లాంటి వారి కెందరికో కూడుపెట్టి పోషించిన కులీనులు. వీడు కూటికి పేదైనా-కులానికి గాని, గుణానికి గాని పేద కాదు. మీరు కాళ్ళు కడిగి కన్యాదానం చేసింది వీడి అన్నకే అన్న విషయం తెలుసుకుంటే వాడి కులమెంత ఉన్నతమైందో, వాడి తాతతండ్రు లెంత దర్జాగా బ్రతికారో మీరు గుర్తించగలరు.!

అందరు నిశ్చేష్టులై నిలువుగుడ్లతో నిలబడిపోయారు. 'బాబుగారూ' అన్నాడు రంగారావు, ఆశ్చర్యంతో కన్నీళ్ళు ధారాపాతంగా కారిపోతుండగా.

తరతరాల వంశ ప్రతిష్ఠ, తాత తండ్రుల దాబుదర్పాలు, పిన్నమ్మ ప్రేమానురాగాలు ఒక్కసారిగా వాడి మోహంలో కన్పడ్డాయేమో! రంగారావును హృదయానికి హత్తుకొని తలను చుంబించాడు గోపాలం.

అతని కళ్ళనుండి అక్షింతల్లాంటి రెండు అశ్రుబిందువులు రంగారావు తలమీద పడి దీవించాయి.

త్రి